క్లుప్తంగా

మెళకువలతో నైపుణ్యం పొందాలి



జెడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులకు సర్టిఫికెట్‌లు అందించిన ఎస్సై చిరంజీవి

అంబాజీపేట: విద్యార్థి దశ నుంచి చదువుతో పాటు క్రీడల్లోనూ క్రమ శిక్షణతో కూడిన మెళకువలతో నైపుణ్యం పొందితే విజయాలు వాటంతట అవే వస్తాయని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. ఇటీవల నిర్వహించిన తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ సంబంధించి అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు అధ్యక్షతన బెల్ట్, సర్టిఫికెట్‌లను ఆదివారం పంపిణీ చేశారు. ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ, గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిస్తే విజయాలకు సోపానాలన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు పి.భూషణం, తైక్వాండో క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామ పరిధిలోని సిర్రా వారి గ్రూపులో నూతనంగా ఏర్పాటు చేసిన 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను జేఈ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు ఆదివారం ప్రారంభించారు. ఎంతో కాలం నుంచి లో ఓల్టేజ్ సమస్యతో బాధపడుతున్న స్థానికులకు ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడకుండా వారికి మెరుగైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జేఈ పేర్కొన్నారు.

స్వామి సన్నిధిలో కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్



శ్రీధర్‌కు స్వామి చిత్రపటం ఇస్తున్న ఏసీ ప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో ఆదివారం విశాఖపట్నానికి చెందిన సీజీఎస్టీ, కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ నీలం శ్రీధర్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాన్ని ఆయనకు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎస్‌వీ ప్రసాద్ అందజేశారు.

కాంట్రాక్టర్ మృతికి సంతాపం



సూర్యనారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంట్రాక్టర్లు

రావులపాలెం: కోనసీమ జిల్లా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లమిల్లి సూర్యనారాయణ రెడ్డి (సూరిబాబు) మృతికి పలువురు కాంట్రాక్టర్లు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన కాంట్రాక్టర్లు రావులపాలెంలో అసోసియేషన్ బిల్డింగ్ వద్దకు చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న నాయకులు

రాజోలు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తాడి శ్రీనివాస ఉమామహేశ్వరరావును ఆదివారం రాజోలు తాలూకా అగ్నికుల క్షత్రియ సేవా సంఘ నాయకులు సత్కరించారు. గణిత ఉపాధ్యాయుడిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆయన తండ్రి తాడి కొండయ్య ఉపాధ్యాయుడిగా ఎనలేని సేవలు అందించారని, ఆయన సోదరుడు తాడి ప్రసాదరావు రాజోలు మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించి గతంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారన్నారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయేల్, నాయకులు బొమ్మిడి మహేష్, తిరుమాని రామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మమే అతి పురాతనమైనది

అయినవిల్లి: సనాతన ధర్మం అతి పురాతనమైనదని, అటువంటి విశిష్ఠ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు ప్రభుజీ సుందర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. ఆయన మాట్లాడుతూ, ఆది దేవునిగా సనాతన ధర్మం శ్రీకృష్ణుడిని కొలుస్తుందన్నారు. ఆయనే మూలధారం అన్నారు.

ఉసూరుమని పింఛన్..!

- ఏడాదిన్నరగా ఓపెన్ అవ్వని సైట్
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- గత ప్రభుత్వంలో నిరంతర ప్రక్రియగా పింఛన్ల మంజూరు

ఓ వృద్ధుడు: అయ్యా.. నాకు 60 ఏళ్లు దాటాయి. వృద్ధాప్య పింఛను ఇప్పించరూ?
సిబ్బంది: ఆ దరఖాస్తులు ఇంకా తీసుకోవట్లేదు తాతా.
వృద్ధుడు: అదేంటి బాబు.. గతేడాది నుంచీ ఇలానే చెబుతున్నారు.
సిబ్బంది: మేమేం చేస్తాం తాతా.. ప్రభుత్వం చెప్తేనే కదా ఇచ్చేది.

మరో కార్యాలయంలో..

ఓ వితంతువు: బాబూ.. నా భర్త చనిపోయాడు. వితంతు పింఛను కోసం 15 నెలల నుంచి తిప్పుతున్నారు? ఎప్పుడు ఇస్తారు.
అధికారి: గవర్నమెంట్ చెప్తేనే కదా ఏదైనా చేసేది. కొత్త పింఛన్లు ఇచ్చేందుకు మరి కొంత సమయం పడొచ్చు.

కొత్త పింఛన్ల కోసం ఓ వృద్ధుడు, వితంతువు, సిబ్బంది మధ్య జరిగిన సంభాషణ ఇది. వీటి బట్టి తెలుస్తుంది కూటమి ప్రభుత్వ పనితీరు ఎలా ఉందనేది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా కొత్త పింఛన్లకు మాత్రం మోక్షం లభించలేదు. గత ప్రభుత్వం త్వరితగతిన త్వరితగతిన పింఛన్లు మంజూరు చేసిందని పలువురు చెబుతున్నారు. కానీ, కూటమి ప్రభుత్వంలో అర్హులు సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కొత్తపేట: వృద్ధాప్య, వితంతు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు ఆయా గ్రామాల్లో సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడం లేదని అధికారుల తేల్చి చెప్పడంతో నిరుత్సాహంతో వెనుతిరుగుతున్నారు. పైగా ఉన్న పింఛన్లు తొలగించే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతమెంతో ఘనం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డుల దరఖాస్తులు తీసుకోవడం, వెంటనే మంజూరు చేయడం వంటి ప్రక్రియ కొనసాగిస్తే, కూటమి పాలనలో దానికి భిన్నంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి ఆరు నెలలకు కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ కొనసాగించడం ద్వారా కొత్తపేట నియోజకవర్గంలో మొత్తం అన్ని రకాల పింఛన్లు 51,337 మంది, పి.గన్నవరం నియోజకవర్గంలో 38,676 మంది, రాజోలు నియోజక వర్గంలో 31,594 మంది పింఛన్లు పొందుతున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన సైట్

2024 ఏప్రిల్ 18న సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆగిన పింఛన్ల సైట్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా ఓపెన్ కాకపోవడంపై అర్హులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. 60 ఏళ్లు నిండిన వృద్ధులు, భర్తను కోల్పోయిన వితంతువులు, శారీరక, మానసిక దివ్యాంగులు ఆయా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. అలా మూడు నియోజకవర్గాల్లో సుమారు 16 వేల మంది అర్హులు ఉంటారని అంచనా.

హామీకే పరిమితం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామంటూ టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఆ హామీ ఊసే ఎత్తడంలేదు. వృద్ధాప్య పింఛను తీసుకునే భర్త చనిపోతే స్పౌజ్ కేటగిరీ కింద అరకొరగా కొంత మందికే గత నెలలో పింఛన్లు మంజూరు చేశారంటూ మిగిలిపోయిన అర్హులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రకాల పింఛన్లకు సంబంధించి సైట్ ఓపెన్ కాకపోవడం, గత ప్రభుత్వంలా కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంపై కూటమి నాయకులను ప్రశ్నించినా, నిలదీసినా తమపై కక్ష కట్టి పింఛను రాకుండా చేస్తారోనని భయపడి మిన్నకుండి పోతున్నారు. ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాల్లో పింఛనుకు అర్హుల దయనీయ పరిస్థితిని అర్థం చేసుకొని నూతన పింఛన్లు మంజూరు చేయాలని పలువురు నాయకులు కోరారు.



కొత్తపేటలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న చిర్ల జగ్గిరెడ్డి (ఫైల్)

ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నా



గత ఏడాది ఫిబ్రవరిలో నా భర్త చనిపోయాడు. జీవనాధారం కోల్పోయాం. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళితే సైట్ ఓపెన్ కాలేదంటున్నారు. ఎన్ని సార్లు వెళ్లినా అదే చెబుతున్నారు. సుమారు ఏడాదిన్నరగా పింఛను కోసం ఎదురుచూస్తున్నా. కానీ ఫలితం లేదు. రూ.4 వేల పింఛను వస్తే జీవనానికి ఉపయోగపడతాయి. ప్రభుత్వం కరుణించి పింఛను మంజూరు చేయాలి.
– కుసుమే ప్రశాంతి, గంటి, కొత్తపేట మండలం

మంజూరు నిరంతర ప్రక్రియ కావాలి



సామాజిక పింఛన్ల మంజూరు నిరంతర ప్రక్రియ కావాలి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎవరి సిఫార్సులతో పని లేకుండా, పారదర్శకంగా ప్రతి ఆరు నెలలకు విధిగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసేది. అదే విధానం ఈ ప్రభుత్వం కొనసాగించాలి. కానీ ఏడాదిన్నరగా సైట్ ఓపెన్ చేయకపోవడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అర్హతే ప్రామాణికంగా పింఛన్లతో పాటు సంక్షేమ పథకాలు మంజూరు చేసి పేదలను ఆదుకోవాలి.
– పోలిమాటి అంజనీకుమారి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, గంటి.

డ్రోన్‌తో అగ్ని అస్త్రం స్ప్రేయింగ్



ఈదరాడలో డ్రోన్ ద్వారా అగ్ని అస్త్రం స్ప్రేయింగ్

మామిడికుదురు: సహజ సిద్ధంగా తయారు చేసిన అగ్ని అస్త్రంతో చీడ పీడలను సమర్థవంతంగా నివారించవచ్చని డీపీఎం శ్రీనివాస్ తెలిపారు. ఈదరాడ గ్రామంలో రైతు లక్ష్మయ్య ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో స్వయంగా తయారు చేసిన అగ్ని అస్త్రం ద్రావణాన్ని ఆదివారం డ్రోన్ ద్వారా స్ప్రే చేయించారు. వరి పంట ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉందని శ్రీనివాస్ చెప్పారు. ఈ పంటపై కాండం తొలగించే పురుగు వ్యాపించిందన్నారు. దీంతో పాటు ఆకుముడత తెగులు నివారణకు అగ్ని అస్త్రం చక్కగా పని చేస్తుందని చెప్పారు. ఎకరానికి మూడు లీటర్ల అగ్ని అస్త్రం ద్రావణాన్ని పది లీటర్ల నీటిలో కలిపి స్ప్రేయింగ్ చేయాలన్నారు. తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు వస్తాయన్నారు. తమ ఆరోగ్యంతో పాటు ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం విధానాన్ని పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎల్–2 కుడుపూడి జానకి, ఐసీఆర్‌పీ చెల్లుబోయిన రాధ, గోగి లెనిన్, డీఎంఎంటీ కుసుమ పద్మ, మెంటర్ కుడుపూడి స్వాతి నాగదుర్గ, వీఏఏ బాలాజీ, ఏఈఓ శివరామకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక



క్రీడాకారులు, కోచ్‌లను అభినందిస్తున్న లతేంద్రవర్మ

రాజోలు: నేషనల్ స్కూల్ గేమ్స్ తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలకు రాజోలుకు చెందిన యెరుబండి లక్ష్మీ శశిరేఖ, వై.దీపిక ఎంపికయ్యారు. ఈ నెల 12న కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారని కోచ్ మణికుమార్ తెలిపారు. అండర్–19 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శ్రీముదునూరి అక్కిరాజు ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ముదునూరి లతేంద్రవర్మ అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతీ, యువకులకు తైక్వాండో శిక్షణ ఇస్తున్న కోచ్‌లు మణికుమార్, బి.కరుణకుమార్‌ను అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

మామిడికుదురు: రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. మామిడికుదురులో జరిగిన సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడిగా కారుపల్లి కల్యాణ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా సాధనాల సత్యనారాయణ, ఆర్థిక కార్యదర్శిగా గెద్దం భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా తోట రాజారావు, ఉంద్రు శ్రీరమణ, లిఖితపూడి శ్రీపాల్, తోట ప్రసాద్ ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పే బ్యాక్ టు ది సొసైటీ ద్వారా వెనుకబడిన పిల్లలకు విద్యను అందించడంతో పాటు సమాజ సేవ చేసే విధంగా ముందుకెళ్తామన్నారు. సమావేశంలో పెద్దలు పాల్గొన్నారు.

విశ్రాంత డీవైఈఓ మృతి



పరిమి రాజ రాజేశ్వరి (ఫైల్)

కొత్తపేట: సుదీర్ఘ కాలం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేసిన పరిమి రాజరాజేశ్వరి (77) ఊపిరితిత్తుల సమస్యతో శనివారం కన్నుమూశారు. 1967 నుంచి 2006 వరకూ 38 ఏళ్లపాటు విద్యా శాఖలో టీచర్, హెచ్‌ఎం, ఎంఈఓగా పనిచేసిన ఆమె చివరగా డీవైఈఓగా పదవీ విరమణ చేశారు.

ఉచిత న్యూరో వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక వెంకట సందీప్ 'ఐ' క్లినిక్ ప్రాథమిక కంటి ఆసుపత్రి వద్ద ఆదివారం ఉచిత న్యూరో వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం సిటీ న్యూరో కేర్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ప్రముఖ న్యూరో స్పెషలిస్ట్ బాలపరమేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం మెదడు, నరాలు, వెన్నెముఖ సంబంధిత వ్యాధులకు, న్యూరోపతి సెన్సిటివిటి పరీక్షలు ఉచితంగా చేశారు.

మత్తుకు బానిస కావొద్దు



పి.లక్ష్మీవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న కాట్రేనికోన ఎస్సై అవినాష్

కాట్రేనికోన: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కాట్రేనికోన ఎస్సై అవినాష్ సూచించారు. పి.లక్ష్మీవాడ గ్రామంలో ఆదివారం కాట్రేనికోన ఎస్సై అవినాష్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు తాగడం, అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులపై ఒక్క కేసు నమోదైనా వారి జీవితం నాశనమవుతుందని అన్నారు. మత్తులోనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం పి.లక్ష్మీవాడ, పెనుమల్లే గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.

ఉప్పలగుప్తం: గ్రామాల్లో జన జాగృతి చైతన్య రథం ద్వారా చట్టాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ఎస్. కొత్తపల్లి, గొల్లవిల్లి సెంటర్లలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏఎస్ఐ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని దర్శించుకున్న జిల్లా ఎస్పీ



విఘ్నేశ్వరస్వామి ఆలయంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

అయినవిల్లి: మండలంలో పసిద్ధిగాంచిన విఘ్నేశ్వర స్వామిని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వాదం అందజేసి, స్వామి శేషవస్త్రాలతో సత్కరించి, చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట స్థానిక ఎస్సై హరికోటి శాస్త్రి తదితరులు ఉన్నారు. అలాగే అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ విఘ్నేశ్వరస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

అన్న సమారాధన

పి.గన్నవరం: ఎల్.గన్నవరం వద్ద కొత్త అక్విడెక్టు పార్కులో ఉన్న శ్రీలక్ష్మీ గణపతి స్వామి నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. ఈ సందర్భంగా స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కార్యక్రమాలకు ఆధ్వర్యం వహించారు.

తెలుగు భాషను పరిపుష్టం చేయండి



అంబాజీపేటలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న తెలుగు పండితులు

అంబాజీపేట: తెలుగు భాషను పరిపుష్టం చేయాల్సిన బాధ్యత భాషోపాధ్యాయులపై ఉందని ప్రముఖ పద్యకవి, విశ్రాంత భాషోపాధ్యాయులు పచ్చిమాల శివనాగరాజు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో రాష్ట్ర, జిల్లా, స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన తెలుగు భాషోపధ్యాయులకు దళిత తెలుగు పండితుల సమూహం ఆధ్వర్యంలో సత్కార సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాతృభాషలోని మాధుర్యాన్ని విద్యార్థులకు రుచి చూపించాల్సిన బాధ్యత తెలుగు ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఏ భాషకు లేని ప్రత్యేకత తెలుగు భాషకు ఉందన్నారు. తెలుగు భాషాభివృద్ధి సమితి రాష్ట్ర అధ్యక్షుడు గూటం స్వామి మాట్లాడుతూ, ఆంగ్లం నేర్చుకోవడంలో తప్పు లేదని, కానీ తెలుగును నేర్చుకోకపోవడం ఒప్పు కాదన్నారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన జి.ప్రభావతి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన పుణ్యమంతుల అర్జున్‌రావు, మట్టా నాగరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి కుంచే నాగ సత్యనారాయణ, జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న తెలుగు భాషా పండితులు పాల్గొన్నారు.

పోలియోను దూరం చేయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ క్లబ్ గవర్నర్ చక్రవర్తి

మలికిపురం: ప్రపంచానికి పోలియో దూరం చేయడమే రోటరీ క్లబ్ లక్ష్యం అని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. మలికిపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన అధికార పర్యటన ఆదివారం జరిగింది. స్థానిక జీఎస్ఎం నర్సింగ్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలియో నిర్మూలన కోసం ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తూ విశేష కృషి చేస్తున్నట్లు చెప్పారు. భారత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుని పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అంతేకాక పాఠశాలలో ఫర్నిచర్, బుక్స్ కల్పన చేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు వెరికోస్ వెయిన్స్ బాధితులకు ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. తన సేవా కార్యక్రమాల ద్వారా ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్న మలికిపురం రోటరీ క్లబ్ సభ్యులను అభినందించారు. అసిస్టెంట్ గవర్నర్ గన్నాబత్తుల సత్యవతి, క్లబ్ అధ్యక్షుడు గెడ్డం పిలిప్ రాజు, కార్యదర్శి సంపత్ కుమార్, కోశాధికారి, దొంగ రవిచంద్ర, రొటేరియన్లు గుబ్బల బాబ్జి, గెడ్డం పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

రావులపాలెం: మండలంలోని ఈతకోట అవంతి ఫ్రోజన్ ఫుడ్స్ ఫ్యాక్టరీలో జరిగిన అమోనియా గ్యాస్ లీక్ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చంటి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురానికి చెందిన మైగాపుల కొండే శ్వరరావు (47) మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 10న ఉదయం కొండేశ్వరరావు విధుల్లో ఉండగా కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ అవడంతో అస్వస్థతకు గురయ్యాడు. వైద్య నిమిత్తం అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని భార్య మైగాపుల శైలజ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

హిందీ భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి



మండపేటలో హిందీ పండిట్ ఫర్జానాను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం (మండపేట): హిందీ భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలని పలువురు వక్తలు అన్నారు. మండపేట పట్టణంలోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహబూబ్ హిందీ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ హిందీ దివస్ నిర్వహించారు. 17 సంవత్సరాలుగా హిందీ అకాడమీని నడుపుతున్న హిందీ పండిట్ ఫర్జానాను ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకుడు కోన సత్యనారాయణ, హెచ్‌ఎం ఎల్. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫర్జానా కృషిని కొనియాడారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు మహమ్మద్ ఫాతిమా, షేక్ మహబూబ్ ఉన్నిషా, విద్యార్థులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



పాఠశాల ఆవరణలో గురువులతో పూర్వ విద్యార్థులు

కె.గంగవరం: మండలంలోని దంగేరు ఉన్నత పాఠశాలలో 1970–1975 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయంగా కలుసుకొని ఉల్లాసంగా గడిపారు. అప్పట్లో చదువుకున్న పూర్వ విద్యార్థుల్లో కొంత మంది ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఉపాధ్యాయులే. తొలుత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు నేమాని వెంకటరామారావు, రిమ్మలపూడి సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులందరూ కలసి సహపంక్తి భోజనాలు చేసి గడిచిన మధుర జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేసుకొని సంతోషం వ్యక్తం చేశారు. వీలైనంత వరకూ ఏటా కలుసుకునేందుకు ప్రయత్నిస్తామని, తమకు విద్యాబోధన నేర్పిన పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒబిళినేని సత్యనారాయణ చౌదరి, డాక్టర్ సూరిబాబు, మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్, ఉపాధ్యాయులు నేదునూరి రాజు, గుణ్ణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

రామచంద్రపురం రూరల్: రేషన్ స్మార్ట్ కార్డులను ద్రాక్షారామలో ఆదివారం పంపిణీ చేశారు. మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శులు పెట్టా సత్యనారాయణ, అడపా వెంకట్, వీఆర్‌ఓ పరంజ్యోతి, రేషన్ డీలర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాయవరం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు సూచించారు. మండలంలోని వెదురుపాకలో ఆదివారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్‌బాబు మాటాడుతూ ఎవరైనా కాల్ చేసి ఓటీపీ అడిగినా, లింక్స్ పంపించి క్లిక్ చేయాలని సూచించినా, ఆన్‌లైన్ జాబ్స్‌లో డబ్బులు పంపిస్తే మీకు రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పినా, ప్రొడక్ట్స్ వారు మీకు లాటరీ తగిలిందని, చార్జెస్ నిమిత్తం డబ్బులు పంపాలని చెప్పినా ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఫేక్ లోన్ యాప్స్ జోలికి పోవద్దని, ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కి కాల్ చేసి సంబంధిత వివరాలు చెప్పాలని సూచించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాయవరం ఏఎస్సై రాంబాబు, స్థానిక నేతలు శ్రీనివాసరెడ్డి, చంటిరెడ్డి, నాగిరెడ్డి, పండు, ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.